# ★ బాబు మంకుతనం ★

'బాబూ! వెడుదాం పద'

'ఉండు అన్నయ్యా కాసేపు'

రఘు దాదాపు అయిదు నిమిషాలవరకు మళ్ళీ మౌనం వహించాడు.

'యింటికి వెడుదామని' రఘూ, 'కాసేపు వుండమని' బాబూ, ఈ సంఘర్షణలతో సుమారు అరగంట అయింది.

ఇంకనైనా అక్కడినించి కదుల్తాడనే ఆశతో మళ్లీ రఘు, బాబుని కదిపి చూచాడు.

కాని లాభం లేకపోయింది.

రఘుకు విసుగెత్తింది. బాబును వొప్పించి, ఇంటికి అతన్ని ఎల్లా తీసుకుపోవటమో రఘుకి తెలిసిందికాదు. రెండు నిమిషాలు తీవ్రంగా ఆలోచించాడు. ఆ చిన్న బుర్రకి అప్పట్లో ఏ ఉపాయమూ తట్టలేదు. నిష్ప్రయోజంగా, నిరర్థకంగా ఒక తృటికాలం వరకూ తలపైని ఖద్దరు టోపినిలాగి తన తలని మెకానికల్‌గా గోక్కున్నాడు. తలకి కొద్దిగా రాపిడి తగిలే సరికి అది కొంచంగా వికసించటం మొదలెట్టింది. పోనీ బుజ్జగించిచూస్తేనో? బాబు ఎంత మంకువాడైనా

ఈ అస్త్రం తప్పకుండా ఆతనిపైన పారుతుందని ఏదో అవ్యక్తమైన నమ్మకం రఘుకి ఆ నిమిషాన కలిగింది.

"బాబూ! మా నాన్న కదూ. వెడుదాంపద" లాలనగా తమ్ముడి బుజాన్ని తట్టి రఘు ఈ వాక్యం పూర్తి చేసాడు.

"వొక్క నిమిషం వుండు అన్నయ్యా!" అంటూ బాబు నిర్లక్ష్యంగా జవాబు చెప్పాడు, రఘుని పాలల్లోని ఈగని తీసేసినట్లు—

"ఆలస్యంచేసి యింటికి వెడితే నాన్న కోప్పడడూ! ఆఫీసునించి వొచ్చే టయిమయింది కూడాను"—

"రానీ! నాకేమిభయములేదులే" అంటూ పిర్రలమీదనించి జారిపోతున్నలాగుని పైకి అశ్రద్ధగా లాగుతూ బాబు జవాబు చెప్పాడు.

తదేక ధ్యాన్నంగా ఆకోతులాటలో నిమగ్నుడై బాబు అల్లా నిర్లక్ష్యంగా జవాబుబు చెప్పటం చూచి రఘు హృదయం చివుక్కుమంది, తనకులేని యిష్టం ఆ కోతులాటలో బాబుకు కలగటంచూచి రఘుకి కొంతవరకు ఆశ్చర్యమేసింది.

పోనీ, ఆ ఆటలో నవీనత ఏమైనా వుందేమోనని రఘు పరికించిచూచాడు ఆవేపు. రఘుకి ఆ ఆటలో నవీనతే మీ కనపడలేదు. స్కూలికివెడుతో, యింటికి తిరిగివొస్తో యెన్నోసార్లు చూచారు ఆ ఆటని వాళ్లిద్దరూకలిసి మళ్ళీ 'ఆ జమాల్‌ఖాన్,' అలగటమూ, ఆతనిభార్య అతన్ని సమాధాన పర్చటమూ ఈ సంగతు లన్ని రోజూ వాళ్లకి మామూలే—

'పోనీ, కోప్పడి బాబుని యింటికి లాక్కెడుతే—

అమ్మయ్యో! మళ్లీ యింట్లో తనకి ఏమన్నా ఆ స్కారం ఉంటుందా? అందరూ బాబుని వెనకేసుకొని అంతా తనదే ఇపరాధమన్నట్లు తనను దూషించే వాళ్లే-తనను కొట్టేవాళ్లే—

"వాడికేమి తెలుసు, వాడుచిన్నవాడు" అన్న తల్లి వాక్యాలూ, "ఈవెధవే నేర్పుతాడు వాడికి" అన్న తండ్రి దూషణలూ జ్ఞాపకమొచ్చి రఘుకి శరీరం కంపర మెత్తింది. ఆ కంపరం కొద్దిగ తగ్గిన తరువాత మళ్ళీ రఘు ఆలోచించటం మొదలెట్టాడు. ఆ ఆలోచనల్లో బాబు ప్రవర్తన కూడా రఘుకి న్యాయంగా కనపడ లేదు.

అనవసరంగా తనతో పోట్లాడి తనని వుడికించి, ఇంట్లో చాడీలు చెబుతాడు. యింట్లోవాళ్ళంతా బాబుమాటల్ని

నమ్మి తనని నానా తిట్లు తిడుతారు. పక్క యింటి అమ్మాయి సుందరం కన్నా బాబు దృష్టిలో తాను లోకువైనాడు.

అమ్మ ఏదైనా తిండిపదార్థం పెడితే ఆ సుందరానికే అంతా వొప్పజెప్పుతాడు గాని తనకు రవ్వంతైనా పెట్టడు. మీదు మిక్కిలి తను వాడి ఆటవొస్తువులు లాక్కుంటాననీ, వాళ్లని కలిసి ఆడుకోనివ్వనని, అనవసరంగా నాన్నా, అమ్మాతో బొంకులు బొంకుతాడు. యింతలోకె మొన్న సాయింత్రిం ఆ మిఠాయీ చిలకలకోసం జరిగిన రభస జ్ఞాపకమొచ్చింది రఘుకి. బాబు తన కిచ్చిన చిలకని తను తినేసి, 'నాకొంచం పెట్టు అన్నయ్యా' అంటూ తనని బుజ్జగించాడు. ఆ చిలకని కొంచంగా తుంచి బాబుకి పెడితే అంతటితో తృప్తికాక, "ఇంకా కొద్దిగా" "ఇంకా కొద్దిగా" అని తనని యాచించి తన దగ్గరున్న చిలకని ఆసాంతం కాజేసాడు. తమ్ముడేకదా తిననీ అని తను వూరుకున్నాడు.

ఆ తరువాత అమ్మదగ్గరికి వెళ్ళి, తను వాడి చిలకని లాగుకున్నాననీ, తనకి యింకొకటి యివ్వమనీ మారాం పెట్టాడు. అమ్మ తనను పిలిపించి వాడిచిలక వాడికివ్వమంది. తన చిలకనికూడా బాబు తిన్నాడని చెపితే 'రఘూ! నిజం చెబుతున్నావా?' అని తనని హెచ్చరించింది.

తరువాత నాన్న ఆ పోట్లాటలో కల్పించుకోవటమే కాకుండా, అన్యాయమంతా తనవేపే వుందని తీర్పుచెప్పి, తనని నాలుగు తన్ని బాబుకి కొత్తచిలకనికొని పెట్టాడు.

నిజంగా బాబు చాలా దుర్మార్గుడు. బాబు మూలకంగానే తనకి తీరని అన్యాయం జరుగుతోంది. ఆ యింట్లో బాబే తనతో అనవసరంగా కల్పించుకుని పోట్లాటతెస్తాడు. వాడిజోలికి పోవద్దని యెంతమనసు రాయిచేసుకున్నా వాడే తనని కెలికి కయ్యానికి లాగుతాడు.

ఆ తరువాత యింట్లో తనమీద చాడీలు, తనను కొట్టించడమూ, తిట్టించడమూనూ—

ఎంత ఆలోచించినా తన తండ్రి తన మీద అంత కోపంగా ఎందుకుంటాడో రఘుకి అర్థంకాలేదు. తనకు మల్లేనే బాబునిమాత్రం ఎందుకు కోప్పడకూడదూ? బాబు చిన్నవాడు కనకనా? చిన్నవాడైతే దయగా చూడాలని ఎక్కడన్నా వ్రాసివుందేమో!

రఘు మొదటివాచకంనుంచీ నాలుగోవాచకంవరకూ తను చదువుకున్న పాఠాలన్నీ జ్ఞాపకానికి తెచ్చుకున్నాడు. ఆ పాఠాలల్లో ఎక్కడా ఈ విషయాన్నిగురించి వ్రాసినట్లు అతనికి తట్టలేదు — పొరపడ్డానేమోనని మళ్లీజ్ఞాపకానికి

తెచ్చుకోవటానికి ప్రయత్నంచేసాడు. చివరకి అతనికి జ్ఞాపకమున్నంతవరకు అల్లాంటి ప్రసక్తే ఆ పాఠాల్లో లేనట్లు రఘుకి ధృడంగా తోచింది.

బాబు తనని ఏ కోశానా ప్రేమించకపోవటమే కాకుండా, యితరులు తనపై కనపరుస్తోన్న ప్రేమనికూడా హరించేస్తున్నాడేమోనని రఘుకి అనుమానం కలిగింది. ఆ తరువాత తన అశాంతికి మూలకారణం 'బాబే' అని రఘు అప్పట్లో వొక నిశ్చయానికి వొచ్చాడు.

ప్రక్కనున్న మార్కెటు గడియారం గంటలు కొట్టటం మొదలెట్టింది. వొకటి....రెండూ....మూడు.... అమ్మయ్యో అయిదుగంటలు అయింది. నాలుగున్నరకల్లా రోజూ వాళ్లనాన్న ఆఫీసునుంచి యింటికి తిరిగివొస్తాడని తోచి రఘు శరీరం కంపించటం మొదలెట్టింది, మారు మాటాడకండా బాబు చొక్కాని ఎడమచేతితో లాగుతూ రఘు యింటివేపె దారితీసాడు. కోతులాట ఆసాంతం అయిపోవటం మూలానా బాబు ఎక్కువ అభ్యంతరపెట్టకండానే రఘుని అనుసరించాడు.

వెంకట్రామయ్యగారిది చాలా వింత ప్రకృతి. ఇల్లంతా—చివరకి భార్యతోసహా—వొక కట్టుబాటులో వుండా

లని అతని వుద్దేశ్యం. టేబిలుమీది పేపరు కిందపడటం కానీ, తను దువ్వుకునే దువ్వెన భార్య బొట్టు పెట్టెలోకి వెళ్ళటంకానీ, చూచి సహించలేడు. ఇలాంటి మామూలు విషయాలేమైనా ఖర్మంజాలక యింట్లో జరుగుతే, అదొక పెద్ద నేరంగా భావించి ఆ రోజల్లా భార్యపైన సణిగేవాడు. ఆ సాధ్వి వెంకట్రామయ్యగారి సణుగులనీ, కోపాలనీ, తాపాలనీ, వేటినీ లక్ష్యపెట్టకండా, మరీ వొకొకనాడు అతను చాలా తీవ్రంగా వెడితే, గొప్ప విజ్ఞానికి మల్లే వొక్క చిరునవ్వు నవ్వి అతన్ని శాంతపరిచేది.

వెంకట్రామయ్యగారికి వంశపారం పర్యంగా కొన్ని నమ్మకాలు, విశ్వాసాలూ సంక్రమించాయి. ఏ విషమపరిస్థితులూ ఆ విశ్వాసాలనీ, నమ్మకాలనీ మార్చలేవు సరికదా రోజుకు రోజూ ఆ బూజుపట్టిన విశ్వాసాలపైననే అతనికి ఒక విధమైన పూజ్యభావాన్ని కల్పించటంలో మాత్రం దోహదమిచ్చాయి. చిన్నపిల్లలెప్పుడూ అబద్ధాలాడరనీ, కొద్దిగా ఈడువచ్చినవాళ్లు చిన్నపిల్లల్ని కళ్ళల్లోపెట్టుకొని కాపాడటం వాళ్ళ విద్యుక్త ధర్మమనీ అతని తలంపు.

ఈ విశ్వాసాలకి ఫలితంగా 'బాబు ఎప్పుడూ అబద్ధాలాడడనీ, రఘు ఎప్పుడూ బాబుని 'బాడీగార్డు'గా కనిపెట్టుకొని వుండటం రఘు విద్యుక్తధర్మమనీ అతని గట్టినమ్మకం

రఘు విద్యుక్తధర్మంలో కాలవశాత్తు ఏదైనా పొరపాటు జరిగితే వెంకట్రామయ్య అది చూచి సహించడు—సహించ లేడుకూడాను—

ఆ రోజు నాలుగున్నరకల్లా ఆఫీసునించివచ్చి, పిల్లలు స్కూలునించి తిరిగి రాకపోవటం గమనించి వెంకట్రా మయ్య యింట్లో చికాకుపడటం మొదలెట్టాడు.

నాలుగున్నరలోపలే ఇంటికి తిరిగివొచ్చే పిల్లలు యింతవరకు రాలేదేమని భార్యని హెచ్చరిస్తే 'ఈపాటికి రావాలి, వొస్తూనే వుంటారని' క్లుప్తంగా ఆమె జవాబు చెప్పింది. ఇంక భార్యనడిగి లాభంలేదని తెలుసుకొని వరం డాలో కుర్చీవేసుకుని పిల్లల రాకకి వెంకట్రామయ్య నిరీక్షిం చటం మొదలెట్టాడు.

వొక్కొక్కటిగా నిమిషాలు నెమ్మదిగా గడుస్తు న్నాయి. ఈ అలస్యానికి అంతా కారకుడు రఘు అని అతనికి తోచింది. చిన్నవాడేమైనా దారిలో మంకుచేసా డేమో? అయితే రఘు వాడిని సముదాయించి త్వరగా యిం టికి తీసుకురావద్దూ? నిజం—అంతా రఘుదేతప్పు 'రానీ వా డిని, చెబుతా' ననుకున్నాడు వెంకట్రామయ్య—

కాలచక్రం నెమ్మదిగా, వెంకట్రామయ్యకి తెలియ కండానే నిమిషాలను చుట్టేస్తోంది.

'టిక్కు'—'టిక్కు'మని పక్కగదిలోని గడియారం చప్పుడు.

వొక్కొక్క సెకెండు గడిచిన కొద్దీ వెంకట్రామయ్యకు ఆదుర్దా ఎక్కువైంది. ఎక్కడైనా, ఏ మోటారు కిందైనా—

ఈ తలంపు వొచ్చేసరికి వెంకట్రామయ్యకి శరీరమంతా ముచ్చెమటలు పోసేయి—'ఈపాటికి రావాలి, వొస్తూనే వుంటారన్న' భార్యమాటలు జ్ఞాపకానికివొచ్చి కొంచం మనసు స్థిమితపడింది.

అయిదు గంటలయింది.

మళ్లీ గడియారం 'టిక్కు' 'టిక్కు'మన్న శబ్దం.

యింతలోకే నిదానించి బజారు వేపు చూచే సరికి కనుమేరలో పిల్లలు కనబడ్డారు. పిల్లల్ని చూడటంతోటే అతని దిగులూ, ఆదుర్దా, ఇట్టే కోపంలోకి మారి వూరుకున్నాయి. మొహమంతా ఎర్రబారింది.

ఈమారు గడియారం "టిక్కు" "టిక్కు"మన్న శబ్దం అతనికి వినపడనేలేదు—

పిల్లలు యింటి చాయల్లోకి రాగానే 'యింత అలస్యమెందుకయింది, వెధవా!' అని రఘుని ఉద్దేశించి ఉరిమాడు వెంకట్రామయ్య.

తండ్రి ముఖ్యలక్షణం చూస్తే అతను అమితమైన కోపంతో వున్నట్టు పొడకట్టింది రఘుకి. ఆ నిప్పులు కక్కుతోన్న కళ్ళనీ, ఆ జాజుకు మల్లె ఎర్రబారిన మొహాన్ని చూచేసరికి రఘు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. జవాబు చెప్పటానికి నోట్లోంచి మాట పెకల్లేదు.

'జవాబు చెప్పవేం,' అని మళ్లీ వురిమాడు వెంకట్రామయ్య. ఇంక జవాబు చెప్పకుండా వుండటం లాభంలేదని తెలుసుకొని 'బాబు, కోతులాట చూస్తూ నిలబడ్డాడు దారిలో' అని రఘు తడబడుతో వాక్యాన్ని పూర్తి చేసాడు.

'నేను కాదు నాన్నా. అన్నయ్యే — నిలబడ్డాడు' అన్నాడు బాబు చప్పున.

'కాదు నాన్నా వాడే ఆలస్యం చేశాడు' అన్నాడు రఘు తొందరగా—

"వెధవా! ఆలస్యం చేసింది కాకుండా చిన్నవాడిమీద నేరాలు చెబుతావా? వాడు అబద్దాలు ఆడుతున్నాడు కదూ" అంటూ తీవ్రంగా రఘు రెండు చెంపలపైన రెండు అంటించాడు వెంకట్రామయ్య. వొక్కుమ్మడిగా ఆ దెబ్బలకి బావురు మన్నాడు రఘు.

రఘు చెంపలు బురబుర పొంగాయి. చేతి అయిదు వేళ్ళు అట్లానే అంటుకుపోయినాయి అచ్చుకుమల్లే—

రఘురోదన విని రఘు తల్లి లోపల్నించివొచ్చి భర్తకి మారు పలకకండా అతన్ని లోపలికి తీసికెళ్ళింది.

ఇదే సమయంగా ఎంచి బాబు పిల్లికి మల్లే అడుగులో అడుగులేసుకుంటూ తిన్నగా లోపలికి జారాడు పక్క చూపుల్తో తండ్రిని పరికిస్తో—

బాబు లోపలికెళ్లే సరికి రఘు చెంపల్ని నిమురుతో తల్లి సముదాయిస్తోంది అన్నయ్యని. ఎంతకూ రఘుమాత్రం ఏడుపు మానటంలేదు.

రఘు ఎందుకు వూరుకోవటం లేదో కనుకుందామని బాబు తిన్నగా వాళ్ల పక్కకు చేరుకున్నాడు. అప్రయత్నంగా రఘు చెంపలు కందిపోవటం గమనించాడు.

పిల్లలకీ, ఆడవాళ్ళకీ సముదాయించినకొద్దీ ఏడుపు మరీ ఎక్కువవటం సహజం—

బాబు దగ్గరికి వెళ్ళటంతోనే "అమ్మా! వీడేఁ, అన్నీ అబద్ధాలు చెప్పి నన్ను కొట్టించాడే" అన్నాడు రఘు ఏడుస్తో—

'పోనీలే నాన్నా, వాడెప్పుడూ అంతే'నని తల్లి రఘుని సముదాయించింది.

అన్నయ్య దీనావస్థ చూచి బాబు హృదయం కలచినట్లయింది.

ఆవోంగిన చెంపల్ని, ఏకధారగా ఏడుస్తోన్న రఘు మొహాన్ని చూచి తండ్రి కఠినత్వం జ్ఞాపకంవొచ్చింది బాబుకి.

బావురుమని ఏడుస్తో 'ఇంకెప్పుడూ అబద్ధాలుచెప్పను అన్నయ్యా' అంటూ బాబు తన చిన్న చేతుల్తో రఘు చెంపల్ని నిమరటం మొదలెట్టాడు.

బాబు నిజంగా తనని ప్రేమిస్తున్నాడని తెలుసుకోగానే రఘు ఏడుపు మరీ ఎక్కువయింది. ఆ ఏడుపులో కూడా బాబుని దగ్గరికి లాక్కుని కావలించుకోవటం మాత్రం మరచి పోలా—

కాఫీ కోసమై పిల్లల వెనకనే లోపలికి వొచ్చిన వెంకట్రామయ్య ఈ దృశ్యాన్ని చూచి నిశ్చేష్టుడైనాడు. అప్పట్లో బాబు అబద్దాలాడ వచ్చుననీ, రఘుది ఏమితప్పు లేక పోవొచ్చునని వెంకట్రామయ్యకి ఆ రోజు మొదటి సారి తట్టింది.

వెంకట్రామయ్య భార్యపిల్లల్నిద్దరినీ దగ్గరకు తీసుకొంటూ భర్త వేపు చూచి అదోవిధంగా చిరునవ్వు నవ్వింది. 'మీదంతా వొక పిల్లలాట' అన్నట్లు ఆ నవ్వులోని అర్థం అతనికి స్ఫురించింది.

వెంకట్రామయ్య మారు మాటాడకుండా భార్య చిరునవ్వుకు జవాబుగా అప్రయత్నంగా తన తల వాల్చాడు.

---